క్లుప్తంగా

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

కేశంపేట: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 8న నిర్వహించనున్న చెరువుల పండుగ, సంస్కృతిక హేల, కట్టలపైన భోజనాల కార్యక్రమం కోసం ఆదివారం వివిధ గ్రామాల్లో చెరువులను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలోని కొత్తపేట చౌటచెరువు, కేశంపేటలోని వేంకటేశ్వర చెరువు, అల్వాలలోని బ్రహ్మసముద్రం చెరువు, ఎక్లాస్‌ఖాన్‌పేట గోల్లవాని చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన విధంగా 22వరకు కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సత్యానారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు తలసాని వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉపాధ్యాయులు



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

నందిగామ: బడీడు పిల్లలను విధిగా బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు. మండలంలోని నర్సప్పగూడలో ఆదివారం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి బడీడు పిల్లల గురించి వాకబు చేశారు. గ్రామంలో పిల్లలు విధిగా చదువుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక రకాలైన వసతులు కల్పిస్తుందని వివరించారు. ఉచితంగా పాఠ్యాపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు తదితర సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. గ్రామస్తులందరూ బడిబాట కార్యక్రమానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్, ప్రభాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీపై నిర్లక్ష్యం తగదు

కొందుర్గు: ఉపాధి హామీ కూలీల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. గత వారం రోజుల క్రితం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్‌లో ఉపాధి పనులు చేస్తూ గ్రామానికి చెందిన సత్యమ్మ ప్రమాదవశాత్తు కింద పడి కాలు విరిగింది. ఈ సందర్భంగా ఆదివారం సీపీఐ, బీకేఎంయూ నాయకులు ఆమెను పరామర్శించారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. కాలు విరిగిన సత్యమ్మను నేటికి అధికారులు పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్యమ్మ కాలుకు శస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చులు భరించడంతో పాటు ఆమె కాలు పూర్తిగా నయమయ్యే వరకు ప్రతిరోజు ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్, నాయకులు చిన్నయ్య, కిశోర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి మెటీరియల్ అందజేత

తలకొండపల్లి: లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధికి కృషిచేస్తానని నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఇసుక, సిమెంట్, స్టీల్, కాంక్రీట్‌ను విజయ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. పెండింగ్ పనులు పూర్తిచేసి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కల్వకోలు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ యాదమ్మ పాల్గొన్నారు.

శాంతి భద్రతలే ప్రగతికి బాటలు



చేవెళ్ల: పోలీస్ పని తీరును తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చిత్రంలో ఏసీపీ ప్రభాకర్, సీఐ వెంకటేశ్వర్లు



కొందుర్గు: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలోని చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ప్రభాకర్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు హయ్యూమ్, ప్రదీప్‌ల ఆధ్వర్యంలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఓపెన్‌ఫోరం, పోలీస్ వ్యవస్థ పనితీరు, గతానికి నేటికి వచ్చిన మార్పులుపై అవగాహన, వీడియో చిత్రాలను చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతూ దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయింపులు, పోలీసులకు ఆధునిక పెట్రోలింగ్ వాహనాలు, డయల్100 వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. నూతన పోలీసుల నియామకాల్లో మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించి ప్రతి పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. పోలీస్ వ్యవస్థకు పూర్తిస్థాయిలో స్వేచ్ఛ కల్పించామని రాజకీయ జోక్యాన్ని తగ్గించామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఎం. క్రిష్ణారెడ్డి, సూర్యపేట శ్రీనివాస్, రవీందర్, పడాల రాములు, మద్దెల శ్రీనివాస్, వెంకటేశ్, క్రిష్ణారెడ్డి, ప్రజలు, గ్రామస్తులు, పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం

కొందుర్గు: తెలంగాణ ఉద్యమంలో పోలీసుల సేవలు చిరస్మరణీయం అని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కొందుర్గులో ఏర్పాటు చేసిన సురక్షా దినంలో భాగంగా హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీఓ ఆంజనేయులు కోఆర్డినేటర్‌గా వ్యవహరించి మాట్లాడారు. రాష్ట్రం కోసం ఎందరో యువకులు ప్రాణత్యాగాలు చేసుకున్నారన్నారు. ఈ ఉద్యమంలో పోలీసులు సహితం ఆత్మబలిదానాలు చేసుకోవడం ఎంతో బాధాకరమని చెప్పారు. ప్రస్తుతం ఫ్రెండ్లీ పోలీసులుగా వ్యవహరిస్తూ ప్రజలకు మరిన్ని సేవలందిస్తున్నారన్నారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పటేల్ రాజేష్ కన్నా, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, నాయకులు రాజారామేశ్వర్ రెడ్డి, రామచంద్రయ్య, నర్సింలు, కావలి యాదయ్య, భీమసేన తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

మండల కేంద్రంలో ఎస్సై సక్రమ్ ఆధ్వర్యంలో సురక్షా దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ..పోలీసుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, జెడ్పీటీసీ బంగారు స్వరూప, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు గూడస్వామి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల అదుపు

కొత్తూరు: ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలు పూర్తిస్థాయిలో అదుపు చేయవచ్చని కొత్తూరు సీఐ బాలరాజు అన్నారు. స్థానిక నాయకులు, ప్రజలకు ఆదివారం ఆయన ఆధ్వర్యంలో స్టేషన్‌లో పోలీసుల విధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, కేసులు నమోదు చేసే విధానం..సెక్షన్లు తదితర విధులను ప్రజలకు తెలియజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. దాడులు, దోపిడీలు, ప్రమాదాలు జరిగితే బాధితులే కాకుండా ప్రజలు కూడా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎంత త్వరగా సమాచారం వస్తే అంతే తొందరగా బాధితులకు న్యాయం జరుగుతుందనే విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలతో అభివృద్ధి వేగవంతం

శంకర్‌పల్లి: శాంతి భద్రతలు ఉన్న చోట అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని శంకర్‌పల్లి సీఐ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. ఆదివారం దశాబ్ది వేడుకల్లో భాగంగా సురక్షా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలో యువకులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక పోలీస్‌స్టేషన్‌లు బలోపేతం చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, క్రైం రేటు తగ్గుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే రోల్ మోడల్

మొయినాబాద్: శాంతి భద్రతలే ప్రగతికి బాటలు వేయడానికి కారణమని మొయినాబాద్ ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. శాంతి భద్రతలు బాగుండడంతోనే పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు మహిళల రక్షణకోసం షీటీంలను ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ సాధించిన ప్రగతిని స్క్రీన్‌లో ప్రదర్శించారు. ఓపెన్ హౌస్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాస్, ఎస్సైలు ప్రణయ్‌తేజ్, శిరీష, నాయకులు జయవంత్, పరమేశ్, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ పనితీరుపై అవగాహన

షాబాద్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన నిర్వహిస్తున్నట్లు షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సురక్షా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజలకు పోలీస్ వ్యవస్థ పనితీరు గతం, నేడు ఎలా ఉందనే దానిపై అవగాహన కల్పించారు. పోలీస్‌శాఖ ప్రగతిని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

భద్రతకు భరోసా

కేశంపేట: రాష్ట్రంలో భద్రతకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, పటిష్టమైన పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పిస్తోందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ టీ విశాల అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కేశంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ.. మహిళల భద్రతకు షీటీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, ఎస్‌ఐ ధనుంజయ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, సర్పంచులు వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఆంజనేయులు, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రావణ్‌రెడ్డి, చంద్రశేకర్, ధన్‌రాజ్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, మురళీమోహన్, శంకర్, పోలీస్ సిబ్బంది భీమ్‌రాజ్, శ్రీకాంత్, కుమారస్వామి, శివలింగం, రాజు, లక్ష్మణ్, రమాదేవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: ర్యాలీలో పాల్గొన్న విశాల తదితరులు



కొత్తూరు: విధులపై అవగాహన కల్పిస్తున్న సీఐ



శంకర్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



శంకర్‌పల్లి: పోలీస్ శాఖ ప్రగతిని స్క్రీన్‌లో తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు



షాబాద్: అవగాహన కార్యక్రమంలో సీఐ

సివిల్ ర్యాంకర్ సుస్మితకు సన్మానం



సుస్మితను అభినందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో పట్టణానికి చెందిన ఇప్పలపల్లి సుస్మిత ఆల్ ఇండియా 384వ ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సుస్మితను అభినందించారు. అనంతరం సుస్మితకు శాలువా, పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సుస్మిత ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు. తల్లిదండ్రుల చదువులో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మంచి ర్యాంకును అందుకొని ఐఏఎస్‌కు ఎంపిక కావడం నియోజకవర్గానికి ఎంతో గర్వకారణమని అన్నారు. భవిష్యత్‌లో చేపట్టే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి తల్లిదండ్రులకు, పట్టణానికి మరింత పేరు ప్రఖ్యాతులను తీసుకురావాలని ఆకాంక్షించారు.

రైతులకు అవమానం బాధాకరం



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీఏసీఎస్ డైరెక్టర్ జితేందర్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఆదివారం కొందుర్గు మండలం ముట్పూర్ రైతువేదిక ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతువేదికల వద్ద ఏర్పాటు చేసిన రైతు ఉత్సవాలకు తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల చేత ఎన్నుకున్న పీఏసీఎస్ డైరెక్టర్లకు సమాచారం ఇవ్వకపోవడంపై అంతర్యమేమిటని ప్రశ్నించారు. రైతు ఉత్సవాల పేరుతో సమావేశాలు నిర్వహించి రైతులను అవమానపరచడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షురాలు వజ్రమ్మ, నాయకులు అంజయ్య, రవి, నర్సింలు, శ్రీనివాసు, ద్విజేందర్, శివ, హమీద్, రమేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కడ్తాల్: మండల కేంద్రంలో అపర్ణ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ రూ.75వేల విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేశారు. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తిభావం పెంపొందుతుందని అన్నారు.

కరాటేతో శారీరక, మానసికోల్లాసం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో మాస్టర్స్

వారియర్స్ కరాటే ఇంటర్నేషనల్ ఫౌండర్ పల్లె బాలీశ్వర్

కేశంపేట: మానసిక, శారీరక దృఢత్వం కరాటే ఇస్తుందని వారియర్స్ కరాటే ఇంటర్నేషనల్ ఫౌండర్ పల్లె బాలీశ్వర్ అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో బ్లాక్‌బెల్టు పోటీలను గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 100 మంది కరాటే విద్యార్థులు పాల్గొనగా అర్హులైన 40 మందికి బ్లాక్ బెల్టులను ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలీశ్వర్ మాట్లాడుతూ... కరాటే వల్ల తమను తము రక్షించుకుంటామనే ధీమా వస్తుందన్నారు. కరాటేలో విద్యార్థినులు చొరవ చూపడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ ఇంద్రసేన, నందులాల్, వీరాసింగ్, యాది (విక్రమ్), మల్లేష్, ధనరాజ్, వాజిద్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కేశంపేట: మండలంలోని ఇప్పలపల్లిలో చిప్పలపల్లి బాలయ్య శనివారం రాత్రి మృతి చెందారు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఐదువేలు, స్త్రీశిసంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల ఐదువేలు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ ఐదువేల చొప్పున ఆదివారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజనేయు లు, రాములు, కృష్ణయ్య, యాదయ్య, ప్రకాష్, శివరాజు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కాంగ్రెస్ నాయకుడు వసంతం, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

చేవెళ్ల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, డీసీసీ మాజీ అధ్యక్షుడు పి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని అంతారంలో జరుగుతున్న వెంకటేశ్‌బాబు క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో వికారాబాద్ జిల్లా, పూడూర్ మండలం, కుత్బుల్లాపూర్ జట్టు విజేతగా నిలువగా అంతారం జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు ఈ టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని తెలిపారు. టోర్నమెంట్‌ను నిర్వహించిన వెంకటేశ్‌బాబును ప్రత్యేకంగా అభినందించారు. ముగింపు కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బి. ఆగిరెడ్డి, పడాల రాములు, పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్ రెడ్డి, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ అధ్యక్షుడు వాజిద్, డీసీసీ ప్రధాన కార్యదర్శులు పెంటయ్యగౌడ్, యాలాల మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



కాకుంట్లలో ఎడ్లబండిపై ఊరేగింపు

చేవెళ్ల: మండలంలో ఆయా గ్రామాల్లో రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం మండలంలోని దామరగిద్ద, కౌకుంట్ల, అంతారం, తలారం, తంగడపల్లి, తదితర గ్రామాల్లో రైతులు ఏరువాకపౌర్ణమి పండుగను నిర్వహించారు. వానాకాలం ప్రారంభంలో రైతులు తమ పంటలు బాగా పండాలని, పశువులకు పూజలు చేస్తారు. జేష్టశుద్ధ పౌర్ణమి రోజున ఈ ఏరువాక పౌర్ణమి జరుపుకొంటారని రైతులు తెలిపారు. ఈ రోజున రైతులు పొలం పనులు కూడా ప్రారంభించారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయాధికారి సురేష్ బాబు

శంకర్‌పల్లి: పంట పెట్టుబడి సహాయం కోసం కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, గతంలో నమోదు చేసుకొని రైతులు రైతుబంధు, రైతుబీమా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్ బాబు తెలి పారు. ఆయన విలేకరులతో మా ట్లాడుతూ.. రైతుబంధు సహాయం కోసం మండలంలోని పర్వేద, మహాలింగపురం, ఎల్వర్తి, మోకిల గ్రామాల్లోని రైతు వేదికల్లో దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. రైతుబీమా దరఖాస్తులను 15వ తేదీ నుంచి ప్రారంభించడం జరుగుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శంకర్‌పల్లి: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి 2003-04 సంవత్సరం చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కలుసుకున్నారు. 20 సంవత్సరాల తరువాత విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా శాలువాతో సన్మానించి షీల్డులను అందజేశారు. అందరం కలు వడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం



మహిళలకు మంచినీటిని అందజేస్తున్న శంకర్

పీసీసీ కార్యదర్శి శంకర్

షాద్‌నగర్: పల్లెలు అభివృద్ధి సాధించినప్పుడే దేశం ప్రగతిపథంలో పయనిస్తుందని పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని పుల్చర్లకుంట తండావాసుల దాహార్తిని తీర్చేందుకు శంకర్ తన సొంత ఖర్చు రూ.2.60 లక్షలతో మినరల్ వాటర్ ఫిల్టర్, రూ.70వేలతో వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. ఆదివారం మినరల్ వాటర్ ప్లాంటు, వీధి దీపాలను ఆయన ప్రారంభించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తండాలను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిందన్నారు. కానీ, తండాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. అనంతరం తండావాసులు వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్, శ్రీశైలం, నర్సింలు, శేఖర్, తండావాసులు రాజునాయక్, డాక్యానాయక్, సంతోష్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

వేద పాఠశాల అభివృద్ధికి విరాళం

మండల పరిధిలోని కిషన్‌నగర్ శివారులో గల శ్రీకాశీ జగద్గురు వేద ఆగమ పాఠశాల అభివృద్ధికి శంకర్ రూ.1.25లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బస్వం, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీశైలం, నర్సింలు, శేఖర్, అశోక్, నవీన్, గణేష్‌రాథోడ్, యాదయ్య, మాణిక్‌భాషా, రాజు పాల్గొన్నారు.